
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
శ్రీకాకుళం
జిల్లా వార్తలు
శనివారం 4 అక్టోబరు 2025




బూర్జ మండలం అల్లెన గ్రామస్థులతో మాట్లాడుతున్న కలెక్టర్

సిక్కోలు జలమయం

- కుండపోతగా వర్షం
- ఉగ్రరూపం దాల్చిన వంశధార, నాగావళి నదులు
- ఈదురుగాలుల బీభత్సం
- నేల కూలిన చెట్లు, విద్యుత్ స్తంభాలు
- ముగ్గురి మృతి.. పలు మూగజీవాలు కూడా..
- 17 మండలాల్లో 8,690 ఎకరాల్లో నీట మునిగిన వరి


కొత్తూరు మండలం మాతల వద్ద వరద


వజ్రపుకొత్తూరు: పెద్దబడాం వద్ద కొట్టుకుపోయిన రోడ్డు

శ్రీకాకుళం, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి)

జిల్లా జలమయమైంది. వాయుగుండం కారణంగా గురువారం కుండపోతగా వర్షం కురిసింది. ఎగువన ఉన్న ఒడిశా రాష్ట్రంలోనూ భారీవర్షాలు కురవడంతో ఆ వరద కూడా జిల్లాను ముంచెత్తింది. వంశధార, నాగావళి, మహేంద్రతనయా, బాహుదా నదులు ఉగ్రరూపం దాల్చాయి. ఈదురు గాలులకు పలుచోట్ల చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకూలాయి. 17 మండలాల్లో 8,690 ఎకరాల వరి పంట పూర్తిగా ముంపునకు గురైంది. మరికొన్ని మండలాల్లో మొక్కజొన్న, అరటి పంటలకు నష్టం వాటిల్లింది. పాతపట్నం, పలాస, నరసన్నపేట, శ్రీకాకుళం నియోజకవర్గాల్లోని నదుల పరివాహక గ్రామాలను వరద చుట్టుముట్టింది. ఇళ్లల్లోకి నీరు చేరడంతో ప్రజలు తీవ్ర అవస్థలకు గురయ్యారు. శ్రీకాకుళం, గార, కొత్తూరు, మందస, వజ్రపుకొత్తూరు, హిరమండలం, పోలాకి, సోంపేట ప్రాంతాల్లో రోడ్లు దెబ్బతిన్నాయి. 74 విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. ఐదు డిస్ట్రిబ్యూషన్ పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌లు పాడయ్యాయి. ఎక్కడికక్కడే విద్యుత్ తీగలు తెగిపడ్డాయి. జిల్లా కేంద్రం శ్రీకాకుళం మినహా.. అంతటా సుమారు 20 గంటల పాటు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. గురువారం (మిగతా 6వ పేజీలో..)


వజ్రపుకొత్తూరు: నగరంపల్లి- శివరాంపురం మధ్య వరద ఉధృతి వల్ల తాడు సహాయంతో రాకపోకలు సాగిస్తున్న ప్రజలు


శ్రీకాకుళం డీసీసీబీ కాలనీ వద్ద మోకాళ్ల లోతులో..


నీట మునిగిన హిరమండలం-నివగాం రహదారి, పంటపొలాలు


రణస్థలం: నేలకొరిగిన మొక్కజొన్న పంట


హిరమండలం: గొట్టాబ్యారేజీ వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న వంశధార

ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడండి

- కలెక్టర్‌ను ఆదేశించిన ముఖ్యమంత్రి చంద్రబాబు

శ్రీకాకుళం కలెక్టరేట్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని నదీ పరీవాహక ప్రాం తాల్లోని ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని ముఖ్య మంత్రి చంద్రబాబునాయుడు కలెక్టర్‌ను ఆదేశించారు. శుక్రవారం ఆయన జిల్లా కలెక్టర్‌తో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మాట్లాడుతూ.. వంశధార నుంచి గొట్టా బ్యారేజీకి 1.4లక్షల క్యూ సెక్కులు, నాగావళి నుంచి తోటపల్లి బ్యారేజీకి 44వేల క్యూసెక్కుల నీరు వచ్చిందని తెలిపారు. ఒడిశా రాష్ట్రం వర్షం నీరు వస్తోందని, ఆ రాష్ట్ర అధికారులతో మాట్లాడి నట్లు తెలిపారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించా మని, నేలకొరిగిన చెట్లను తొలగించి, విద్యుత్తు సరఫరాను పునరుద్ధరించినట్లు చెప్పారు. ప్రస్తుతం 9వేల ఎకరాల వ్యవసాయ భూములు ముంపునకు గురయ్యా యన్నారు. ఎస్డీఆర్ఎఫ్ టీమ్‌లను సిద్ధంగా ఉంచామని, కలెక్టరేట్‌లో 24 గంటలు పనిచేసే విధంగా కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

వణికించి'నది'

హిరమండలం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): వంశధార ఉగ్రరూపం దాల్చింది. ఐదేళ్ల తరువాత నదిలో లక్ష క్యూసెక్కులకు పైగా వరద నీరు ప్రవహించింది. గురువారం ఉదయం గొట్టా బ్యారేజి వద్ద 11,585 క్యూసెక్కులు, రాత్రి ఒంటి గంటకు 40 వేల క్యూసెక్కులకు చేరడంతో మొదటి ప్రమాద హెచ్చరికను అధికారులు జారీ చేశారు. 2 గంటలకు 51,389, శుక్రవారం ఉదయం 6 గంటలకు 66,557, తొమ్మిది గంటలకు 80,526 ప్రవహించడంతో రెండో ప్రమాద హెచ్చరికను జారీ చేశారు. మధ్యాహ్నం 12 గంటలకు లక్ష, ఒంటి గంటకు 1,01,554 క్యూసెక్కుల వరద ప్రవహించింది. గొట్టా బ్యారేజి 23 గేట్లను వంశధార అధికారులు పైకెత్తి వచ్చిన నీటిని వచ్చినట్టే సముద్రంలోకి విడిచిపెట్టారు. మధ్యాహ్నం మూడు గంటల నుంచి వరద ఉధృతి క్రమేపీ తగ్గుతూ వచ్చింది. దీంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. శుక్రవారం రాత్రి 8గంటలకు 86,257 క్యూసెక్కులు నదిలో ప్రవహించింది. వంశధార ఎస్ఈ జి.రామచంద్రరావు ఆధ్వర్యంలో ఈఈ మురళీమోహన్, డీఈఈ సరస్వతి, ఏఈ ధనుంజయరావు సిబ్బంది ఎప్పటికప్పుడు వరద పరిస్థితిని అంచనా వేస్తున్నారు.

మృత్యువులోనూ వీడని బంధం

- ఇంటి గోడ కూలి వృద్ధ దంపతుల మృతి
- సవర టుబ్బూరు గ్రామంలో ఘటన
- రూ.8లక్షల పరిహారం ప్రకటించిన ప్రభుత్వం


గోడ కూలిన దృశ్యం




బుద్ధయ్య, రూపమ్మ మృతదేహాలు

హరిపురం, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలకు ఇంటి గోడ కూలడంతో గిరిజన వృద్ధ దంపతులు మృతి చెందారు. ఈ ఘటన మందస మండలం హంసరాలి పంచాయతీ సవర టుబ్బూరులో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన సవర బుద్ధయ్య (64), రూపమ్మ(60) దంపతులు. వీరికి ఇద్దరు కుమారులు మోహనరావు, నాగేశ్వరరావు, ఇద్దరు కుమార్తెలు సావిత్రి, ఈశ్వరి ఉన్నారు. మోహనరావుకు వివాహం కాలేదు. హైదరాబాద్‌లో పని చేసుకుంటూ స్వగ్రామంలో ఉన్న తల్లిదండ్రుల పోషణ బాధ్యతను చూస్తున్నాడు. నాగేశ్వరరావు వివాహం చేసుకొని పక్క గ్రామంలో ఉంటున్నాడు. కుమార్తెలకు పెళ్లిళ్లు జరిగి వారి అత్తవారి గ్రామాల్లో ఉంటున్నారు. అయితే, సాఫీగా సాగిపోతున్న బుద్ధయ్య, రూపమ్మ జీవితాన్ని చూసి విధికి కన్ను కుట్టిందేమో వర్షం రూపంలో వారి ప్రాణాలను బలితీసుకుంది. గురువారం రాత్రి భోజనం చేసిన అనంతరం బుద్ధయ్య, రూపమ్మ నిద్రకు ఉపక్రమించారు. అర్ధరాత్రి దాటిన తరువాత వారి ఇంటి మట్టి గోడ కూలడంతో ఇద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. గ్రామ యువకులు జలంధ్ర, నాగేంద్ర, బాబూరావులు (మిగతా 6వ పేజీలో)

వరదలో కొట్టుకుపోయి తాపీమేస్త్రి..

పలాస, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ మొగిలిపాడు గ్రామానికి చెందిన తాపీమేస్త్రి సైన గోపాలరావు(45) వరదలో కొట్టుకుపోయి మృతి చెందాడు. గురువారం సాయంత్రం గోపాలరావు తన పంట పొలాలు చూసేందుకు వెళ్లి గుంతలో పడి నీటి ప్రవాహానికి కొట్టుకుపోయాడు. శుక్రవారం సాయంత్రం గ్రామ సమీపంలో జాతీయ రహదారి కల్వర్టు వద్ద బురదలో గోపాలరావు మృతదేహం లభ్యమైంది. ఈయనకు భార్య సరస్వతి, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. ఈఘటనపై తమకు సమాచారం అందిందని కాశీబుగ్గ సీఐ పి.సూర్యనారాయణ తెలిపారు.


గోపాలరావు(ఫైల్)


రాజరాజేశ్వరీదేవీగా దర్శనమిస్తున్న నీలమణిదుర్గ

ముగిసిన దసరా ఉత్సవాలు

- రాజరాజేశ్వరీదేవీగా నీలమణిదుర్గ

పాతపట్నం, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో దసరా ఉత్సవాలు ముగిశాయి. అల్పపీడనం కారణంగా గురువారం ఎడతెరిపి లేని వర్షం కురిసింది. ప్రజలు చాలావరకూ ఇళ్లకే పరిమితమై పూజాది కార్యక్రమాలు నిర్వహించుకున్నారు. దీంతో ఆలయాల్లో భక్తుల తాకిడి తక్కువైంది. స్థానిక నీలమణి దుర్గ అమ్మవారు రాజరాజేశ్వరీదేవీ అలంకరణలో పూజలందుకున్నారు. ఎమ్మెల్యే మామిడి గోవిందరావు సతీసమేతంగా దర్శించుకున్నారు. ఆలయ కార్యనిర్వాహణాధికారి టి.వాసుదేవరావు, సీఐ సన్యాసి నాయుడు ఎస్ఐ మధుసూధనరావు, టీడీపీ మండల అధ్యక్షుడు పైల బాబ్జీ, ఆలయ చైర్మన్ అక్కంధ్ర సన్యాసిరావు పాల్గొన్నారు.

రేపటి నుంచి స్కూల్‌గేమ్స్ ఎంపికలు
7లో

విద్యుత్ ప్రమాదం సంభవిస్తే దిక్కెవరు?

- 930 పడకల ఆసుపత్రికి ముగ్గురే ఎలక్ట్రీషియన్లు
- వేధిస్తున్న సిబ్బంది కొరత ● కానరాని కొత్త నియామకాలు
- ఇదీ జీజీహెచ్ (రిమ్స్)లో పరిస్థితి

శ్రీకాకుళం రిమ్స్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): జిల్లా నలుమూలల నుంచి పేదలు ఈ పెద్దాసుపత్రినే ఆశ్రయిస్తుంటారు. తమ ఆరోగ్యానికి భరోసా దొరుకుతుందని, తమలాంటి నిరుపేదలకు ఇదే పెద్ద దిక్కని వస్తుంటారు. 930 పడకలతో ఉన్న ఈ ఆస్పత్రిలో మాత్రం సమస్యలు రాజ్యమేలుతున్నాయి. ముఖ్యంగా విద్యుత్ ప్రమాదం సంభవిస్తే దిక్కెవరనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. అదే జిల్లా కేంద్రం శ్రీకాకుళంలోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి(రిమ్స్). మొత్తం ఆసుపత్రికి సంబంధించి ఎలక్ట్రీషియన్లు ముగ్గురే ఉన్నారు. వీరిలో రెగ్యులర్ ఎలక్ట్రీషియన్ ఒకరు కాగా, మరొకరు కాంట్రాక్టు పద్ధతిలో, ఇంకొకరు ఔట్ సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్నారు. ఏళ్లు గడుస్తున్నా కొత్త నియామకాలు జరగడం లేదు. వాస్తవానికి ఆస్పత్రిలో 25 మంది విద్యుత్ సిబ్బంది అవసరం. కానీ, కేవలం ముగ్గురు మాత్రమే సేవలందిస్తున్నా రు. రిమ్స్‌కు సంబంధించి ఇటీవల కొత్త ఉద్యోగాల కోసం నోటిఫికేషన్‌ను అధికారులు జారీ చేశారు. ఇందులో ఎలక్ట్రీషియన్ పోస్టులకు చోటు లేకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

తరచూ ప్రమాదాలు..

శ్రీకాకుళం జీజీహెచ్‌లో తరచూ షార్ట్ సర్క్యూట్ ఘటనలు సంభవిస్తున్నాయి. కొద్ది నెలల కిందట పిడియాట్రిక్ వార్డులో విద్యుత్ ప్రమాదం జరిగింది. అయితే, ఎటువంటి అపాయం జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. మరోసారి జరిగిన షార్ట్ సర్క్యూట్‌తో కంప్యూటర్లు పాడైపోయాయి. ఇలా తరచుగా సంఘటనలు జరుగుతున్నా ఎలక్ట్రీషియన్లను కనీసం ఔట్ సోర్సింగ్ పద్ధతిలోనైనా నియమించక పోవడంపై రోగులు ఆందోళన చెందుతున్నారు. ప్రధానంగా ఎమర్జెన్సీ, పీడియాట్రిక్ తదితర వార్డుల్లో ఏసీలు తరచుగా పాడైపోతున్నాయి. విద్యుతు సరఫరాలో హెచ్చు తగ్గులు, షార్ట్ సర్క్యూట్ ప్రమాదాలే ఇందుకు కారణం. ఆసుపత్రికి అనుబంధంగా ఉన్న వైద్య కళాశాల(రిమ్స్)లోని లైబ్రరీలో ఇటీవల జరిగిన షార్ట్ సర్క్యూట్‌తో కంప్యూటర్లు, ఏసీలు (మిగతా 6వ పేజీలో)





గొర్రెల మందపైకి దూసుకెళ్లిన ఆర్టీసీ బస్సు

- 17 జీవాలు మృత్యువాత

లావేరు, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): సుభద్రాపురం- చీపురుపల్లి రహదారిపై శుక్రవారం ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. మేతకు వెళ్తున్న గొర్రెల మందపైకి ఆర్టీసీ బస్సు దూసుకొచ్చింది. ఈ ఘటనలో 17 గొర్రెలు మృత్యువాత పడ్డాయి. సుభద్రాపురం గ్రామానికి చెందిన కోరాడ కోటి, గోవిందరావు, కోండ్రు నారాయణ తమ గొర్రెలను మేత కోసం తోలుకెళ్తుండగా సుభద్రాపురం- గురుగుబిల్లి జంక్షన్ మధ్యలో శ్రీకాకుళం నుంచి చీపురుపల్లి వెళ్తున్న ఆర్టీసీ బస్సు మందపైకి దూసుకెళ్లింది. బస్సు చక్రాల కింద నలిగి అక్కడికక్కడే 11 గొర్రెలు మృతి చెందగా, మరో ఆరు గొర్రెలు తీవ్ర గాయాలై గంటల వ్యవధిలోనే అవి కూడా చనిపోయాయి. మృతి చెందిన గొర్రెలకు స్థానిక పశువైద్యాధికారి (మిగతా 6వ పేజీలో)


మృతిచెందిన గొర్రెలు

మహానుభావుల త్యాగాలను గుర్తుచేసుకోవాలి

శ్రీకాకుళం కలెక్టరేట్, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి):మహానుభావుల త్యాగాలను అందరూ గుర్తుచేసుకోవాల్సి అవసరం ఎంతైనా ఉందని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పేర్కొన్నారు. గురువారం మహాత్మాగాంధీ, దేశ రెండో ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి జయంతి సందర్భంగా కలెక్టరేట్ ఆవరణలోని గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే కలెక్టరేట్ సమావేశ మందిరంలో గాంధీ, లాల్ బహదూర్‌శాస్త్రి చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. మహానుభావుల త్యాగాలు, పోరాటాల ఫలితంగానే నేడు మనమంతా స్వేచ్ఛను అనుభవిస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్ బి.పద్మావతి, డీఆర్వో ఎం.వెంకటేశ్వరరావు, మున్సిపల్ కమిషనర్ ప్రసాదరావు, జిల్లా టూరిజం అధికారి ఎన్.నారాయణరావు, కలెక్టరేట్ ఏవో సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.


గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కలెక్టర్

కోతకు గురవుతున్న వంశధార కరకట్ట
● బిక్కుబిక్కుమంటున్న ప్రజలు
6లో



6న స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర అవార్డులు
7లో

ఆలయంలో చోరీకి ప్రయత్నం

● గ్రామస్థులకు పట్టుబడిన వ్యక్తి

వజ్రపుకొత్తూరు, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): అనకాపల్లి వద్ద కొండ మహంకాళీ అమ్మవారి ఆలయంలో చోరీకి ప్రయత్నిస్తూ ఓ యువకుడు పట్టుబడిన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామాల్లో తిరుగుతూ వంట సామగ్రి విక్రయిస్తున్న ఆ వ్యక్తి.. అనకాపల్లి గ్రామంలోని అమ్మవారు గుడి వద్ద గురువారం రాత్రి తచ్చాడుతూ కనిపించాడు. దీంతో ఆ వ్యక్తిని గ్రామ యువత పట్టుకుని నిలదీయడంతో ఆలయంలో చోరీ చేసేందుకు వచ్చినట్టు అంగీకరించాడు. అప్పటికే మందస మండలంలోని పలు గ్రామాల్లోని ఆలయాల్లో చోరీ చేసినట్టు చెప్పాడు. శుక్రవారం ఉదయం ఆ యువకుడ్ని, ఆయన దొంగలించిన ఆభరణాలను పోలీసులకు అప్పగించారు. ఆ యువకుడి వద్ద లభించిన ఆధార్‌కార్డు ప్రకారం నరసన్నపేటకు చెందిన కల్లూరి ప్రభుదాసుగా స్థానికులు చెబుతున్నారు. కాగా పగలంతా వంట సామగ్రి విక్రయిస్తూ.. రాత్రి సమయంలో ద్విచక్ర వాహనంపై ఆలయాల్లో చోరీ చేస్తున్నట్టు చెప్పినట్టు గ్రామ యువకులు తెలిపారు. దీనిపై పోలీసులు మాట్లాడుతూ.. ఆ వ్యక్తిని అదుపులోకి తీసుకుని పూర్తి స్థాయిలో విచారణ చేపడుతున్నట్టు స్పష్టం చేశారు.

ఆగి ఉన్న ఆటోను ఢీకొన్న మరో ఆటో

● నలుగురికి గాయాలు


ఘటనా స్థలంలో బోల్తాపడిన ఆటోలు

నరసన్నపేట, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): కోమర్తి-దేవాది గ్రామాలు మధ్య జాతీయ రహదారిపై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురు మహిళలు గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. శ్రీకాకుళం నుంచి నరసన్నపేట వైపు వస్తున్న ఆటో కోమర్తి పెట్రోల్ బంకు వద్ద నిలిపి ఉండగా వెనుక నుంచి వచ్చిన మరొక ఆటో ఢీకొంది. దీంతో అదుపుతప్పిన ఆటోలు బోల్తాపడ్డాయి. ఈ ప్రమాదంలో అంపోలు గ్రామానికి చెందిన దంత జయశ్రీ, దంత కనకమహాలక్ష్మి, ధర్మాన సంధ్య, నరసన్నపేటకు చెందిన జమ్ము రాజేశ్వరమ్మ గాయపడ్డారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం శ్రీకాకుళం సర్వజన ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ దుర్గాప్రసాద్ తెలిపారు.

బోల్తాపడిన లగేజీ ఆటో


గోతులో బోల్తాపడిన లగేజీ ఆటో

హిరమండలం, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): హిరమండలం పాత గ్రామీణ బ్యాంకు అలికాం-బత్తిలి ప్రధాన రహదారిపై పెద్దపెద్ద గోతులు ఏర్పడడంతో తరుచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు గోతుల్లో నీరు చేరడంతో అవి కనిపించక ద్విచక్ర వాహనదారులు ప్రమాదానికి గురై ఆసుపత్రి పాలవుతున్నారు. శుక్రవారం ఒక లగేజీ ఆటో ఇక్కడ ఏర్పడిన పెద్ద గోతిలో దిగి అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో ఎవరికి ఎటువంటి గాయాలు కాలేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రహదారి మరమ్మతులు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

బైక్‌ను ఢీకొన్న వ్యాన్.. ఒకరు మృతి


ఘటనా స్థలంలో జగన్ మృతదేహం

కోటబొమ్మాళి, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి కన్నేవలస పెట్రోల్ బంకు సమీపంలో శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో కన్నేవలస గ్రామానికి చెందిన రావాడ జగన్ (38) మృతి చెందగా, మెండ అర్జున్ (35) తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. జగన్, అర్జున్ ద్విచక్ర వాహనంపై బంక్‌కు వచ్చి పెట్రోల్ కొట్టించుకొని డివైండర్ దాటుతుండగా.. పలాస నుంచి విశాఖ వైపు వెళ్తున్న బొలెరో వాహనం ఢీకొంది. ఈ ఘటనలో జగన్ అక్కడిక్కడే మృతి చెందగా.. తీవ్రంగా గాయపడిన అర్జున్‌ను చికిత్స కోసం 108 వాహనంలో తొలుత టెక్కలి జిల్లా ఆసుపత్రికి.. అక్కడి నుంచి శ్రీకాకుళంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. జగన్‌కు భార్య ప్రభావతి, కుమారుడు షన్ముఖరావు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ వి.సత్యనారాయణ తెలిపారు.

నాగావళి నదిలో పడి యువకుడి ఆత్మహత్యాయత్నం

శ్రీకాకుళం క్రైం, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): నాగావళి నదిలో పడి యువకుడి ఆత్మహత్యాయత్నం ఘటన శ్రీకాకుళం నగరంలో శుక్రవారం సంభవించింది. వివరాలిలా ఉన్నాయి.. గార మండలం రెల్లపేటకు చెందిన బాగి రాజు(24) నగరంలోని కంపోస్టు కాలనీ వద్ద నాగావళి నదిలోకి దూకి ఆత్మహత్యా యత్నాయత్నానికి పాల్పడ్డాడు. ఇంటిలో సూసైడ్ నోట్ పెట్టి ఈ అఘాయత్నానికి పాల్పడినట్టు తెలుస్తోంది. నదిలో ఇసుక తిన్నెపై రాజు ఉండిపోవడంతో స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో అగ్నిమాపక సిబ్బంది, గజ ఈతగాళ్లు, వన్ టౌన్ పోలీసులు, డీఎస్పీ వివేకానంద నేతృత్వంలో అక్కడికి చేరుకుని ఆ వ్యక్తిని రక్షించారు. ఆత్మహత్యాయత్నానికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

పార్టీ సేవకు పరిమితమవుతాను

నరసన్నపేట, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): రానున్న ఎన్నికల్లో తన కుమారుడు ధర్మాన కృష్ణచైతన్య ఎమ్మెల్యే అభ్యర్థిగా వైసీపీ పోటీ చేస్తాడని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అన్నారు. నడగాం గ్రామంలో విజయదశమి సందర్భంగా గురువారం కార్యకర్తలతో కృష్ణచైతన్య అనే కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. తనకు వయస్సు రీత్యా నియోజవర్గంలో తిరగడం భారంగా ఉందని అందుకు ఈసారి చైతన్యను అభ్యర్థిగా పోటీలో నిలబెట్టడం తప్పనిసరి అవుతుందన్నారు. తాను వైఎస్ జగన్మోహన్‌రెడ్డి సేవలో ఉంటానని నరసన్నపేటలో పార్టీ, కార్యకర్తల బాధ్యత కృష్ణచైతన్య చూసుకుంటారని ప్రకటించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ధర్మాన కృష్ణచైతన్య, అరంగి మురళీ తదితరులు పాల్గొన్నారు. అలాగే శుక్రవారం కంబకాయి గ్రామంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు తెలిపారు.

మృత్యువులోనూ వీడని బంధం

(ఐదో పేజీ తరువాయి)

గ్రామస్థుల సహకారంతో ఆ దంపతులను హుటాహుటిన హరిపురం సీహెచ్‌సీకి తరలించారు. అప్పటికే బుద్ధయ్య మృతిచెందగా, రూపమ్మ చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం కన్నుమూసింది. దీంతో గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి. ఈ ఘటనపై మందస పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ● వీరి దీనస్థితిని గ్రామ యువకులు టీడీపీ మండల అధ్యక్షుడు బావన దుర్యోధన, మాజీ సర్పంచ్ తమిరి భాస్కరరావుతో కలసి ఎమ్మెల్యే శిరీష దృష్టికి తీసుకెళ్లారు. ప్రభుత్వ పెద్దలతో మాట్లాడిన ఎమ్మెల్యే.. వృద్ధ దంపతులకు ఒక్కొక్కరికి రూ.4లక్షలు చొప్పున రూ.8లక్షలు ఎక్స్‌గ్రేషియో ప్రకటించారు. చెక్కులను శనివారం అందజేయనున్నట్లు చెప్పారు.


అరసవల్లి: మునిసిపల్ కార్యాలయం వద్ద గాంధీజీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే గొండు శంకర్


నరసన్నపేట: సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి


పాతపట్నం: మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాలేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే మామిడి గోవిందరావు

గాంధీజీకి ఘన నివాళి

మహాత్మా గాంధీ జయంతిని గురువారం జిల్లాలో వివిధ ప్రాంతాల్లో నిర్వహించారు. అధికారులు, ప్రజాప్రతి నిధులు గాంధీజీ విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఎమ్మెల్యేలు గొండు శంకర్, నడుకుదిటి ఈశ్వరరావు, బగ్గు రమణమూర్తి, మామిడి గోవిందరావు తదితరులు మాట్లాడుతూ.. స్వాతంత్ర్యోద్యమంలో గాంధీజీ పోరాటాన్ని వివరించారు. కార్యక్రమా ల్లో అధికారులు, కూటమినేతలు పాల్గొన్నారు.

\- ఆంధ్రజ్యోతి బృందం


రణస్థలం: గాంధీజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే ఎన్ఈఆర్


శ్రీకాకుళం లీగల్: గాంధీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బార్ అసోసియేషన్ ప్రతినిధులు, న్యాయవాదులు


ఎచ్చెర్ల: బీఆర్ఏయూలో మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న వర్సిటీ రిజిస్ట్రార్ అడ్డయ్య

కోతకు గురవుతున్న వంశధార కరకట్ట

● బిక్కుబిక్కుమంటున్న పలు గ్రామాల ప్రజలు
● పరిశీలించిన కలెక్టర్ పుండ్కర్

హిరమండలం, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): వంశధార నదిలో ఉధృతంగా వరద నీరు వస్తుండడంతో గొట్టా బ్యారేజి ఎగువ ప్రాంతంలోని నదికి ఎడమవైపు ఉన్న వరదగట్టు ప్రమాదకరంగా మారింది. తుంగతంపర గ్రామ సమీపంలో గ్రామాలకు రక్షణగా ఉన్న వరదకట్ట శుక్రవారం వచ్చిన వరద ఉధృతికి భారీగా కోతకు గురవుతుంది.తూ వస్తుంది. ఆ కరకట్ట పక్కనే ఉన్న చొర్లంగి, తుంగతంపర, గొట్టా గ్రామాల ప్రజలు బిక్కుబిక్కుమంటూ చూస్తున్నారు. ఏ క్షణాన గట్టు తెగి ఊరిలోనికి వరద నీరు వచ్చేస్తుందేనని భయాందోళన చెందుతున్నారు. ఈ విషయాన్ని గ్రామస్థులు ఎమ్మెల్యే మామిడి గోవిందరావు దృష్టికి తీసుకువెళ్లారు. ఆయన కలెక్టర్‌కు సమాచారం ఇవ్వడంతో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ శుక్రవారం రాత్రి తుంగతంపర గ్రామానికి చేరుకుని పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు. గట్టుకోతకు గురై గండిపడితే నదిలో నీరంతా తుంగతపంర, గొట్టా గ్రామాలను ముంచేత్తుతాయని అధికారులు కలెక్టర్‌కు వివరించారు. దీంతో ఈ రెండు గ్రామాల ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించేందుకు కలెక్టర్ ఏర్పాటు చేశారు. రెండు ఆర్టీసీ బస్సులు, పలు ప్రైవేట్ పాఠశాలల బస్సులను రప్పించారు. అలాగే ఎన్డీఆర్ఎఫ్ బృందాలను సిద్ధంగా ఉంచారు. డివిజన్‌లోని పోలీసు సిబ్బందిని రప్పించారు. రాత్రికిరాత్రే గట్టుకు గండి పడకుండా ఉండేందుకు టీడీపీ నాయకులతో మాట్లాడి ఇసుక, క్రషర్ బుగ్గి ట్రాక్టర్లతో తెప్పించి కోతను పూడ్చేందుకు చర్యలు చేపట్టారు. అర్ధరాత్రి వరకు కలెక్టర్ గ్రామంలోనే ఉండి ఏర్పాట్లన్నీ పర్యవేక్షించారు. ఈయనతో పాటు టెక్కలి ఆర్డీవో కృష్ణమూర్తి, ట్రైనీ కలెక్టర్ పృధ్వీరాజ్‌కుమార్, డీఎస్పీ దాసరి లక్ష్మణరావు, వంశధార ఎస్ఈ జి.రామచంద్రరావు, సీఐ ప్రసాదరావు ఉన్నారు.


గ్రామస్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ఘనంగా షిర్డీసాయికి అన్నాభిషేకం


అన్నప్రసాద వితరణలో పాల్గొన్న దువ్వాడ శ్రీధర్

పలాస, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): స్థానిక శివాజీనగర్‌లోని షిర్డీసాయి ధ్యాన మందిరంలో బాబావారి 107వ పుణ్యతిథి సందర్భంగా గురువారం అన్నాభిషేకాన్ని నిర్వహించారు. ఉదయం 10.30 గంటల నుంచి గంటపాటు అభిషేకాన్ని చేయగా మధ్యాహ్నం 11.30 గంటల నుంచి అన్నప్రసాద వితరణ జరిగింది. ఈ సందర్భంగా 24 గంటలపాటు ఏకాహం నిర్వహించారు. శుక్రవారం వేకువజాము 6.30 గంటలతో ఈ కార్యక్రమం ముగిసింది. ఈ సందర్భంగా షిర్డీసాయి బాబా సంస్థాన్ ట్రస్టు చైర్మన్ దువ్వాడ శ్రీధర్(బాబా) మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరు సాయితత్వం తెలుసుకోవాలని, ఆయన అనుగ్రహంతోనే నిర్విఘ్నంగా అన్నప్రసాద వితరణ జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యుడు దువ్వాడ అన్నాజీరావు, ధర్మపురి వాయునందనశర్మ, రుంకు శంకర్, శ్రీనివాస్, కృష్ణ, సుబ్బిరెడ్డి, సాయివర్ధన్, కొర్ల దుర్యోధన, మార్పు శ్యామ్, తిరునగిరి శ్రీనివాస్, తారకేశ్వరరావు, ధర్మాపు గణపతి, కల్యాణం శంకర్, బరాటం సత్యం, వెంకటరమణ, సనపల జగన్నాథం పాల్గొన్నారు.

పునరావాసం కల్పించి పరిహారం ఇవ్వండి

● కలెక్టర్ ముందు పెనుగోటవాడ గ్రామస్థుల మొర

కొత్తూరు, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి) ప్రతీ ఏటా వంశధార నది వరదలకు జలదిగ్బంధంలో చిక్కుకుంటున్న పెనుగోటవాడ గ్రామాన్ని తరలిస్తే 2013 భూసేకర చట్టం అనుసరించి నష్టపరిహారం, ప్యాకేజీలు, ఇళ్ల నిర్మాణాలు చేస్తే తమ గ్రామం ఖాళీ చేస్తామని ఆ గ్రామస్థులు కలెక్టర్, ఎస్పీ, ఎమ్మెల్యే ముందు వాపోయారు. వంశధార నదికి వరదలు వచ్చే ప్రమాదం ఉందని గుర్తించిన కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎస్పీ మహేశ్వరరెడ్డి, పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు గురువారం రాత్రి పొద్దు ఆ గ్రామం సందర్శించి అప్రమత్తం చేశారు. తమ గ్రామం ఖాళీ చేయాలంటే తమకు శాశ్వత ఇళ్లు, నష్టపరిహారం, ప్యాకేజీలు అందించాలని కోరారు. అంతకు మందు నివగాం, వసప గ్రామాల్లో పర్యటించారు.

సేవింగ్స్‌పై ప్రజలకు చైతన్యం కల్పించాలి

ఎల్ఎన్ పేట, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): దేశంలో పేద, మధ్యతరగతి వర్గాలవారికి కూటమి ప్రభుత్వం ఇచ్చిన సూపర్ జీఎస్టీ గిఫ్ట్‌పై గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజల్లో చైతన్యం కలిగించాలని టెక్కలి రెవెన్యూ డివిజన్ డీడీవో అలివేలి మంగమ్మ తెలిపారు. మండల కేంద్రంలోని ఐకేపీ భవనంలో శుక్రవారం ఎంపీడీవో పి.శ్రీనివాసరావు అధ్యక్షతన మెడికల్ షాపు యజమానులు, ఐకేపీ సీసీలతో జరిగిన సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ప్రధాని మోదీ పేద, మధ్యతరగతి ప్రజలు వాడుతున్న నిత్యావసరవస్తువుల ధరలను దృష్టిలో ఉంచుకొని జీఎస్టీ ధరలను తగ్గించడం జరిగిందన్నారు. నిత్యావసర వస్తువులపై గతంలో ధరలను, జీఎస్టీ తగ్గించిన తర్వాత వస్తువుల ధరలను దృష్టిలో ఉంచుకొని ప్రజలకు అవగాహన కలించాలన్నారు. తగ్గించిన జీఎస్టీ ధరలు గ్రామాల్లో ప్రజలకు తెలియక వ్యాపారస్తులకు మోసపోవడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో వెలుగు సిసిలు, మెడికల్ షాపు యజమానులు పాల్గొన్నారు.

సూపర్ గిఫ్ట్ ఇచ్చిన ఎన్డీఏ ప్రభుత్వం



మాట్లాడుతున్న జీఎస్టీ నోడల్ అధికారి చంద్రశేఖర్

టెక్కలి, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): ఎన్డీఏ ప్రభుత్వం సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్ గిఫ్ట్‌ను అందించిందని జీఎస్టీ నోడల్ అధికారి చంద్రశేఖర్ అన్నారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో వ్యాపారులు, చిన్నతరహా పరిశ్రమ యాజమాన్యాలు, హోటల్స్ యాజమాన్యాలకు జీఎస్టీపై అవగాహన కల్పించారు. వారికున్న సమస్యలను నివృత్తి చేశారు. వ్యాపారులు అమ్మకాల పెరుగుదలకు ఎంతగానో దోహదపడుతుందని వారన్నారు. కార్యక్రమంలో వర్తక వాణిజ్య సంఘం అధ్యక్షులు లాడి శ్రీనివాసరావు, జీఎస్టీ అధికారి బెనర్జీ, ఈవోపీ ఆర్డీ సింహాద్రి, ఈవో శ్రీనివాస్‌తో పాటు వ్యాపారులు జామి నర్సింహమూర్తి, వెంకటేశ్వరరావు, శాసనపురి కుమారస్వామి, తంగుడు శంకర్, మోనింగి గోవింద్, వైశ్యరాజు మురళి ఉన్నారు.

రేపు ఎయిర్‌పోర్టు ప్రతిపాదిత గ్రామ ప్రజలతో సమావేశం

పలాస, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): పలాస రైల్వే ఇనిస్టి ట్యూట్‌లో ఎయిర్‌పోర్టు ప్రతిపాదన చేసే గ్రామాలకు సంబంధించి ప్రజలతో ఈ నెల 5వ తేదీన సమావేశం ఏర్పాటు చేస్తున్నామని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష శుక్రవారం సాయంత్రం విలేకరులకు తెలిపారు. సమావేశానికి కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, జిల్లా కలెక్టర్ స్వప్నిక్ దినకర్ పుండ్కర్, ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి హాజరవుతున్నారన్నారు. కేంద్రమంత్రి ప్రత్యేక చొరవతో ప్రతిపాదిత ఎయిర్‌పోర్టు ఏర్పడే గ్రామాల ప్రజలకు ఉన్న సందేహాలు నివృతం చేయడానికి, వారి ప్రశ్నలకు సమాధానం చెప్పడానికి తాము ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఉదయం 9.30 గంటల నుంచి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, ఎయిర్‌పోర్టు ఏర్పాటు చేయబోయే గ్రామాల ప్రజలంతా హాజరుకావాలని ఆమె కోరారు.

జీఎస్టీపై అవగాహన కల్పించండి

నందిగాం, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం నూతనంగా అమలు చేసిన సూపర్ జీఎస్టీపై అవగాహన కల్పించాలని మండల ప్రత్యేకాధికారి, డీఎల్‌పీవో ఐవీ రమణ సూచించారు. శుక్రవారం స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో మండలస్థాయి అధికారులు, కార్యదర్శులతో సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గ్రామస్థాయిలో ప్రజల్ని చైతన్యపరిచి కేంద్రం పేద, మధ్య తరగతి వర్గాలకు కల్పించిన సేవింగ్స్‌పై వివరించి తద్వారా వారిలో వివిధ వస్తువులపై లభిస్తున్న ఆదాను తెలియజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కుమార్ పట్నాయక్, డిప్యూటీ ఎంపీడీవో కె.సంతోష్‌కుమార్, అధికారులు జి.నర్సింహులు, ఎం.నాగరాజు, పి.శ్రీకాంత్‌వర్మ తదితరులు ఉన్నారు.

నేడే వాహనమిత్ర నగదు జమ

మెళియాపుట్టి, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి) కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం శనివారం ఆటో కార్మికులకు వాహనమిత్ర పథకం కింద ఆటో కార్మికుల ఖాతాలకు నగదు జమకానున్నాయి. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆగస్టు 15 నుంచి మహిళలకు ఒక వైపు స్త్రీశక్తి పథకం ద్వారా రాష్ట్రంలో ఎక్కడికైన ప్రయాణం చేసే వెసులు బాటు కల్పించగా మరోవైపు ఆటో కార్మికులకు ఒక్కొక్కరికి రూ.15వేలు చొప్పున్న వారి ఖాతాలకు నగదు జమ చేయటం అభినందిస్తున్నారు. శ్రీకాకుళం జిల్లాలో 15,341 దరఖాస్తులు చేసుకోగా 14,901 మంది అర్హులుగా గుర్తించారు. 408 మంది అనర్హులుగా గుర్తించి తిరస్కరించారు. లబ్ధిదారులకు రూ.22.35కోట్లు ప్రభుత్వం నిధులు మంజూరు చేయనుంది. రాష్ట్రంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు ఈ పథకం ప్రారంభిస్తుండగా జిల్లాలో వ్యవసాయ శాఖా మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు టెక్కలిలో ప్రారంభించనున్నట్టు అధికారులు తెలిపారు. ఏదిఏమైనప్పటికి ఆటో కార్మికులకు దసరా కానుకగా రూ.15 వేలు వారి ఖాతాల్లో జమ చేయడంతో ఆటో కార్మికుల్లో ఆనందం కన్పిస్తుంది.

సిక్కోలు జలమయం

(ఐదో పేజీ తరువాయి)

రాత్రి నుంచి వంశధార నదిలో వరద అధికమైంది. శుక్రవారం నుంచి నాగావళి నది ఉధృతమైంది. పలాస నియోజకవర్గంలో తుఫాన్ తీరం దాటినట్లు అధికారులు అంచనావేశారు. మందస మండలం హంసరాలి పంచాయతీ సవర టుబ్బూరులో గోడ కూలి సవర బుధ్ధయ్య, రూపమ్మ అనే వృద్ధ దంపతులు, వరదలో కొట్టుకుపోయి పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ మొగిలిపాడు గ్రామానికి చెందిన తాపీమేస్త్రీ సైన గోపాలరావు మృతి చెందారు. పలుచోట్ల మూగజీవాలు మృత్యువాతపడ్డాయి. కేంద్ర పౌరవిమానయాన మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఎప్పటికప్పుడు జిల్లా అధికార యంత్రాంగంతో మాట్లాడారు. అధికారులు తీసుకుంటున్న చర్యలపై ఆరా తీశారు. ప్రజలకు ఇబ్బందులు వాటిల్లకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎస్పీ మహేశ్వరరెడ్డి.. అధికారుల బృందం .. ఎమ్మెల్యేలతో కలసి ముంపు ప్రాంతాల్లో పర్యటించారు. ఎటువంటి పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు అధికారులు సిద్ధంగా ఉండాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు పునరావాస కేంద్రాలకు స్వచ్ఛందంగా తరలివెళ్లాలని పిలుపునిచ్చారు. మండల ప్రత్యేక అధికారులు, నియోజకవర్గ అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఇతర అధికారులు పూర్తి అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. నందిగాం మండలంలోని లోతట్టు ప్రాంతం ఉయ్యాలపేట జలదిగ్బంధంలో చిక్కుకుంది. గ్రామానికి చెందిన ఎం.నారథుడు అనారోగ్యానికి గురవడంతో ఆయన్ను డోలీ సాయంతో గ్రామస్థులు వరద నీటిని దాటించి సీతానగరం రహదారికి చేర్చారు. అక్కడ నుంచి 108లో టెక్కలి ఆసుపత్రికి తరలించారు. జిల్లాలో 84 హెక్టార్లలో ఉద్యానవన పంటలు దెబ్బతిన్నాయి. వివిధ గృహాలు పాడవడంతో రూ.2.50లక్షల నష్టం, ఆర్అండ్‌బీకి సంబంధించి 16 రోడ్లు దెబ్బతినడంతో రూ.46లక్షలు, పంచాయతీ రహదారులకు రూ.10లక్షలు, మున్సిపాలిటీకి సంబంధించి రూ.1.80 లక్షలు, విద్యుత్‌శాఖకు రూ.20లక్షలు మొత్తం రూ.70లక్షల నష్టం వాటిల్లింది.

పలాసలో 16 సె.మీ. వర్షపాతం


నీటమునిగిన రైల్వేస్టేషన్ రోడ్డు

పలాస, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): పలాస-కాశీబుగ్గ జంట పట్టణ ప్రజలు గతంలో కనీవినీ ఎరుగని రీతిలో కుండపోత వర్షాన్ని చూశారు. గురువారం వేకువజాము 4 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ ఎడతెరిపి లేని వర్షం కురిసింది. దీంతో అన్నీ వీధులు జలమయం కాగా ప్రధాన రహదారులపై రెండు అడుగులకు పైగా వరదనీరు ప్రవహించింది. దీంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యాయి. ఎనిమిదేళ్ల కిందట ఇదేస్థాయిలో నాలుగురోజుల పాటు వర్షం కురవడంతో ఈ స్థాయిలో నీరు చేరింది. ఇప్పుడు తొమ్మిది గంటల్లోనే రికార్డు స్థాయిలో 16 సెంటీ మీటర్ల వర్షపాతం నమోదు కావడం పలాస చరిత్రలో ఇదో రికార్డుగా నిలిచింది. మరో గంటపాటు వర్షం కురిసి ఉంటే భారీగా నష్టం జరిగిఉండేదని అధికారులు చెబుతున్నారు. ఎన్నడూ లేని విధంగా పలాస రైల్వేస్టేషన్ రోడ్డుపై రెండు అడుగుల మేర నీరు ప్రవహించడం అంతా వింతగా చూశారు. దీంతో షాపులన్నీ మూయాల్సి వచ్చింది.

కూలిన భారీ వృక్షం


సంతవురిటి వద్ద నిలిచిన ట్రాఫిక్

జి.సిగడాం, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): చిలకపాలెం-రాజాం ప్రధానరహదారి సంతవురిటి కూడలి వద్ద భారీ వృక్షం కూలిపోయింది. దీంతో ఇరువైపులా కిలోమీర్ల పొడవునా ట్రాఫిక్ నిలిచిపోయింది. ఎస్ఐ వై.మధుసూదనరావు సిబ్బందితో అక్కడికి చేరుకుని ట్రాఫిక్ మళ్లించారు. సంతవురిటి, దవళపేట సర్పంచ్‌లు బుడారి లక్ష్మణరావు, వడిస మహేష్ చొరవతో రోడ్డుకు అడ్డగా పడిపోయిన చెట్టును తొలగించారు.

ఒడిశా వాసిని కాపాడిన పోలీసులు

సోంపేట, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): భారీ వర్షాల కారణంగా మహేంద్రతనయ నీటిప్రవాహం ఒక్కసారిగా పెరిగింది. బారువ, మూలపోలం గ్రామాల మధ్య వంతెన పనులు జరుగుతుండగా పనిముట్లను తీసుకువచ్చేందుకు వంతెన వద్దకు వెళ్లి ఒడిశా రాష్ట్రం బాంజీబాల్ గ్రామానికి చెందిన కార్మికుడు నవీన్ నీటి ప్రవాహంలో కొట్టుకుపోయాడు. అలా నీటిలో కొట్టుకుపోతూ ఓ విద్యుత్ స్తంభాన్ని పట్టుకుని ఉండి పోయాడు. దీనిని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. బారువ ఎస్ఐ హరిబాబు నాయుడు ఆధ్వర్యంలో పోలీసులు రెస్క్యూ ఆపరేషన్ చేసి ఆ వ్యక్తిని సురక్షితంగా ఒడ్డుకు తీసుకువచ్చారు.

విద్యుత్ ప్రమాదం సంభవిస్తే దిక్కెవరు?

(ఐదో పేజీ తరువాయి)

సీలింగ్, ఫర్నీచర్ కాలిపోయాయి. ఈ ప్రమాదం నుంచి విద్యార్థులు త్రుటిలో తప్పించుకున్నారు. అయినా అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. ఎవరైనా ప్రాణాలు కోల్పోతే గానీ, చర్యలు తీసుకోరా...అని విద్యార్థులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా జీజీహెచ్ అధికారులు స్పందించి, సమస్య తీవ్రతను గుర్తించి ఎలక్ట్రీషియన్ల నియామకానికి తక్షణ చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

గొర్రెల మందపైకి దూసుకెళ్లిన ఆర్టీసీ బస్సు

(ఐదో పేజీ తరువాయి)

గాయత్రి పోస్టుమార్టం నిర్వ హించారు. వీటి విలువ రూ.1.70 లక్షల వరకు ఉంటుందని, ప్రభుత్వం ఆదుకోవాలని గొర్రెల యజమానులు కోరుతున్నారు. సమాచారం తెలిసిన వెంటనే స్థానిక ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. బాధిత కుటుంబాలను ఓదార్చారు. అన్ని విధాలా ఆదుకుంటామని వారికి భరోసా ఇచ్చారు. కాగా, బస్సు డ్రైవర్ అజాగ్రత్త, మితిమీరిన వేగం కారణంగానే ఈ ప్రమాదం జరిగిందని స్థానికులు చెబుతున్నారు.

శ్రీముఖలింగేశ్వరాలయంలో శమీ పూజ

జలుమూరు, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): శైవ పుణ్యక్షేత్రం శ్రీముఖలింగేశ్వరాలయంలో కొలువు తీరిన వారాహి అమ్మవారి సన్నిధిలో దసరా ఉత్సవాలు పురస్కరించుకొని గురువారం శమీపూజ అర్చకులు నిర్వహించారు. శరన్నవరాత్రులు పురస్కరించుకొని ఆఖరి రోజు విజయదశమి పర్వ దినాన శమీపూజ నిర్వహించారు. ముందుగా గణపతిపూజ, పుణ్యాహవచనం, కళశారాధన, నిర్వహించి వారాహి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి మంగళహారతులు అందించారు. శమీపూజ గ్రామ పురోహితులు భూషణశర్మ నేతృత్వంలో నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

సందడిగా విజయదశమి

కాశీబుగ్గ, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): పలాస కాశీబుగ్గ పరిసరాల్లో గురువారం విజయదశమి వేడుకలు ఉత్సాహంగా నిర్వహించారు. కాళిక వేషాలతో దుర్గాదేవీలను ఘనంగా పురవీధుల్లో ఊరేగింపు నిర్వ హించారు.


ఆకట్టుకునేలా ప్రదర్శన

పంటల నష్టాన్ని ప్రాథమికంగా అంచనా వేయాలి

● మంత్రి అచ్చెన్నాయుడు



ఫోన్‌లో సూచనలిస్తున్న రాష్ట్ర మంత్రి అచ్చెన్నాయుడు

శ్రీకాకుళం, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో తుఫాన్ ప్రభావంతో సంభవించిన పంటల నష్టాన్ని ప్రాథమికంగా అంచనా వేయాలని రాష్ట్ర వ్యవసాయశాఖా మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఆదేశించారు. ఈ మేరకు శుక్రవారం అమరావతి నుంచి వ్యవసాయ, హార్టికల్చర్ ఉన్నతాధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించి సూచనలిచ్చారు. 'బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయుగుండం ప్రభావంతో ఉత్తరాంధ్రలో విస్తృతంగా వర్షాలు కురిసాయి. భారీవర్షాల కారణంగా పంటలు దెబ్బతినే అవకాశం ఉంది. వ్యవసాయ, హార్టికల్చర్ అధికారులు తక్షణమే క్షేత్రస్థాయికి వెళ్లి పంటల నష్టాన్ని ప్రాథమిక అంచనా వేయాలి' అని ఆదేశించారు. వాయుగుండం ప్రభావం తగ్గిన తర్వాత ఆకస్మిక వరదలు వచ్చే అవకాశం ఉందని అధికారులు, సిబ్బంది మరింత అప్రమత్తంగా ఉండాలన్నారు. రైతులు తీసు కోవాల్సిన జాగ్రత్తలపై స్పష్టమైన సూచనలివ్వాలని వ్యవసాయ శాఖ అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఏ పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు రెవెన్యూ, పోలీసు, విద్యుత్, ఇరిగేషన్ శాఖలు సమ న్వయంగా పనిచేయాలని సూచించారు. జిల్లా కేంద్రంలో కంట్రోల్ రూం 24 గంటలపాటు పని చేసేలా ఉండాలని.. టోల్ ఫ్రీ నంబర్లు 112, 1070, 1800 425 0101 ద్వారా సమాచారం పొందవచ్చని ఆయన స్పష్టం చేశారు.

అప్రమత్తంగా ఉండండి

● కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు



ఫోన్‌లో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి రామ్మోహన్

శ్రీకాకుళం, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో వాయుగుండం నేపథ్యంలో శ్రీకాకుళం జిల్లా వ్యాప్తంగా ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి. ఈ నేపథ్యంలో తాజా పరిస్థితులు, తీసుకోవాల్సిన ముందు జాగ్రత్త చర్యలపై కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌తో కేంద్రమంత్రి కింజరాపు రామ్మో హన్‌నాయుడు ఫోన్‌లో సమీక్షించారు. రెవెన్యూ అధికారులందరూ అందుబాటులో ఉండేలా.. విపత్కర పరిస్థితుల్లో తక్షణ తోడ్పాటు అందించేలా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ఏడు నియోజక వర్గాల ఎమ్మెల్యేలతో ఫోన్‌లో మాట్లాడారు. తక్షణ జాగ్రత్తలు తీసుకో వాలని సూచించారు. టెక్కలి, శ్రీకాకుళం, పలాస, ఇచ్ఛాపురం, నరస న్నపేట నియోజకవర్గ ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలని ఆయన కోరారు.

విద్యుత్ శాఖకు రూ. 20 లక్షలు ఆస్తి నష్టం

● ఎస్ఈ నాగిరెడ్డి

శ్రీకాకుళం, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో దసరా నాడు సంభవించిన తుఫాన్ బీభత్సానికి విద్యుత్ శాఖకు రూ.20 లక్షలు ఆస్తి నష్టం వాటిల్లింది. సుమారుగా వంద విద్యుత్ స్తంభాలు విరిగి పడ్డాయి. 5 ట్రాన్స్ ఫార్మర్‌లు పాడయ్యాయి. 27 మండలాల్లో తీవ్ర ప్రభావం చూపింది. వెంటనే విద్యుత్ సిబ్బంది పునరుద్ధరణ పనులు చేపట్టారు. జిల్లా మొత్తం అంధకారంలోకి వెళ్లినప్పటికీ 24 గంటల్లోగా విద్యుత్ సరఫరా పునరుద్ధరించారు.

ముందుగానే 600 మంది విద్యుత్ సిబ్బందిని, 300 మంది కాంట్రాక్ట్ వర్కర్లను సిద్ధం చేయడంతో పనులు వేగవంతంగా చేయగగామని ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ నాగిరెడ్డి కృష్ణమూర్తి తెలిపారు. తుఫాన్ వల్ల రూ.20 లక్షల నష్టం వాటిల్లిందని వెల్లడించారు. ఎక్కడైనా విద్యుత్ సరఫరాలో లోపాలు, తెగిపడిన వైర్లు ఉంటే వెంటనే సంబంధిత డివిజన్ హెల్ప్ డెస్క్‌లకు (శ్రీకాకుళం- 9490610045, పలాస-9480610050, పాలకొండ-08945-241084)లేదా ఏపీఈపీడీసీఎల్ టోల్ ఫ్రీ నంబర్ 1912కు సమాచారం ఇవ్వాలని ఎస్ఈ కోరారు.

న్యూస్ బాక్స్

జిల్లాకు రెండు 'స్వచ్ఛ' అవార్డులు

శ్రీకాకుళం, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): జిల్లాకు రెండు స్వచ్ఛ ఎస్ఎల్ఎఫ్ అవార్డులు వచ్చాయి. శ్రీకాకుళం మండలం శ్రీ గౌరీ శంకర మహిళా సమాఖ్యకు 'స్వచ్ఛ ఎస్ఎల్ఎఫ్' అవార్డు లభించింది. అలాగే స్వచ్ఛ హాస్టల్స్‌లో మెళియాపుట్టి మండలం నేలబొంతు గ్రామానికి చెందిన జీటీడబ్ల్యూ ఆశ్రమ స్కూల్‌కు అవార్డు వచ్చింది. ఈ అవార్డులను త్వరలో రాష్ట్ర ప్రభుత్వం అందజేయనుంది.

అమ్మవారి లడ్డూ రూ.56,500

గార రూరల్, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): కొర్ని గ్రామంలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. పోలమాంబ ఆలయ ప్రాంగణంలో చివరి రోజున ఆలయ నిర్వాహకులు లడ్డూ వేలం పాట గురువారం నిర్వహించారు. అదే గ్రామానికి చెందిన ఆరంగి దశరథరావు మాస్టారు, ఏవీసీహెచ్ నాయుడు కుటుంబ సభ్యులు రూ.56, 500లకు లడ్డూ ప్రసాదాన్ని దక్కించుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు.

పిప్పలేశ్వర స్వామికి వెండి ధారాపాత్ర బహూకరణ

శ్రీకాకుళం రూరల్ 3(ఆంధ్రజ్యోతి): ఇప్పిలి గ్రామంలోని స్వయంభూ ఉమా పిప్పలేశ్వరస్వామికి గాయకుడు ఇప్పిలి శ్రీకాంత్ శుక్రవారం రూ.1.80 వేల విలువ చేసిన వెండి ధారపాత్రను బహూకరించారు. ఈ మేరకు ఎంపీటీసీ సభ్యుడు ఇప్పిలి సత్యనారాయణ ఆధ్వర్యంలో అర్చకుడు బంకుపల్లి బాల కృష్ణశర్మకు అందజేశారు. కార్యక్రమంలో పలువురు స్థానికులు పాల్గొన్నారు.


7న మహర్షి వాల్మీకి జయంతి

శ్రీకాకుళం కలెక్టరేట్, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): మహర్షి వాల్మీకి జయంతి ఉత్సవాలను ఈ నెల 7న నిర్వహించనున్నట్లు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర వేడుకగా నిర్వహిస్తున్న ఈ ఉత్సవాలను ఉదయం 10.30 గంటల నుంచి బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహిస్తామని, అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు.

విద్యార్థులకు ఇంటర్న్‌షిప్

సోంపేట, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు దసరా సెలవుల్లో ఇంటర్న్‌షిప్ ప్రోగ్రాం నిర్వహించారు. రిపేర్‌షాపు, ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లి ట్రైనింగ్ ఇప్పించారు. ఒకేషనల్ ట్రైనర్స్ ఎల్.చైతన్య బి.సునీత, కె.జగదీష్ పర్యవేక్షణలో ఈ కార్యక్రమం చేపట్టారు. హెచ్ఎం బి.మల్లేశ్వరరావు, ఒకేషనల్ కోఆర్డినేటర్ తిరుపతిరావు, శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా 'గొండు'



గొండు కృష్ణమూర్తి

గార రూరల్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): వైసీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా డీసీఎంఎస్ మాజీ చైర్మన్ గొండు కృష్ణమూర్తి నియమితు లయ్యారు. ఈ మేరకు ఆ పార్టీ కార్యాలయం నుంచి ఉత్తర్వులు అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయనను పలువురు పార్టీ నేతలు అభినందించారు.

ప్రధాన సమస్యల పరిష్కారమే లక్ష్యం



వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే రవికుమార్

ఆమదాలవలస, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): సీఎం నారా చంద్రబాబు నాయుడు ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజాదర్బార్ ద్వారా వచ్చే ప్రధాన సమస్యల పరిష్కారమే లక్ష్యంగా కృషి చేస్తానని ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రజా దర్బార్ నిర్వహించి వినతులు స్వీకరించారు. నాలుగు మండలాలు, మునిసిపాలిటీ నుంచి పలువురు విన తులు సమర్పించారు. వీటిపై ఆయన స్పందిస్తూ.. రహదారులు, కాలు వలు, విద్యుత్, తాగునీరు, వైద్య సేవలు తదితర అంశా లపై వచ్చిన ఫిర్యాదులను ఆయన పరిశీలించి వాటి పరిష్కారానికి చర్యలు తీసు కుంటానని హామీ నిచ్చారు. కార్యక్రమంలో మునిసిపల్ మాజీ ఛైర్ పర్సన్ తమ్మినేని గీతా విద్యాసాగర్, టీడీపీ మండల అధ్యక్షుడు నూక రాజు, రాష్ట్ర కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ తమ్మినేని చంద్రశేఖర్, ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ బోనెల అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గింపుతో ప్రజలకు ఊరట



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గొండు శంకర్

అరసవల్లి, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): జీఎస్టీ తగ్గింపుతో ప్రజలకు మరింత ఊరట చేకూరుతుందని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. మునిసిపల్ కార్యాలయంలో శుక్రవారం జీఎస్టీ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జీఎస్టీని కేవలం రెండు స్లాబు లకే పరిమితం చేయడం వల్ల వినియోగదారులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందన్నారు. వ్యాపారులు తగ్గింపు జీఎస్టీ వివరాలను ప్రదర్శించాలన్నారు. కార్యక్రమంలో జీఎస్టీ నోడల్ అధికారి, మునిసిపల్ కమిషనర్, చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు పాల్గొన్నారు.

స్వదేశీ వస్తువులను ప్రోత్సహించాలి

అరసవల్లి, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): ప్రజలు విదేశీ వస్తువులను విడనాడి, స్వదేశీ వస్తువులను ప్రోత్సహించాలని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. స్థానిక ఏడురోడ్ల జంక్షన్ వద్ద మున్సిపల్ హైస్కూల్ మైదానంలో ఖాదీ సంతను శుక్రవారం ప్రారంభించారు. స్వదేశీ నినాదాన్ని ప్రజల్లోకి తీసుకుని వెళ్లేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఖాదీ, చేతివృత్తులు, హస్తకళలు, సేంద్రియ ఉత్పత్తులు, ఆయుర్వేదం, మిల్లెట్స్, మొక్కలపై విస్తృత ప్రచారం చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, వ్యాపార వేత్తలు పాల్గొన్నారు.

పంచ పరివర్తన్ సూత్రాలే ప్రగతికి మూలం

శ్రీకాకుళం లీగల్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): పంచ పరివర్తన్ సూత్రాలే దేశ ప్రగతికి మూలాధార మని రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ విజయనగరం విభాగ్ కార్యదర్శి దుంగ వెంకటరమణమూర్తి అన్నా రు. ఆర్ఎస్ఎస్ శతాబ్ది సందర్భంగా స్థానిక కార్యాలయంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సామాజిక సమరసత, పర్యావరణ సమతుల్యత, ఉమ్మడి కుటుం బాలు, స్వదేశీ వస్తువుల వాడకంతోనే దేశం అభివృద్ధి చెందుతుందని ఆర్ఎస్ఎస్ విశ్వసిస్తోందన్నారు. కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ నగర అధ్యక్షుడు డాక్టర్ కింజరాపు అమ్మన్నాయుడు, ప్రతినిధులు గురుగుబిల్లి రాజు, డాక్టర్ సింగూరు చైతన్య, వసంతరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా హనుమాన్ విగ్రహ ప్రతిష్ఠ



విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే అశోక్

ఇచ్ఛాపురం, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 22వ వార్డు వీకేపేట జంక్షన్ వద్ద నూత నంగా ఏర్పాటు చేసిన హనుమాన్ విగ్రహ ప్రతిష్ఠోత్సవం శాస్త్రో క్తంగా నిర్వహించారు. ఎమ్మెల్యే బెందాళం అశోక్ స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో టీడీపీ కౌన్సిలర్ కాళ్ల దిలీప్ , టీడీపీ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు పత్రి తవిటయ్య, ఎస్.కోటి తదితరులు పాల్గొన్నారు.

వృత్తి నైపుణ్యంతో అభివృద్ధి

లావేరు, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి) : మహిళలు ఆసక్తి ఉన్న వృత్తిలో నైపుణ్యం సాధించడం ద్వారా అభివృద్ధి సాధ్యమని సెర్ప్, స్త్రీనిధి ఎండీ ఇన్‌చార్జి బ్యాంకు లింకేజ్ డైరెక్టర్ జీవీబీడీ హరిప్రసాద్ అన్నారు. శుక్రవారం తాళ్లవలస గ్రామసంఘం ప్రతినిధులకు ఎంసీపీపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళలు వారు ఏ రంగంలో అయితే ఆసక్తి చూపుతారో తెలుసుకుని అదే రంగంలోనే వారిని ప్రోత్సహించాలన్నారు. డీఆర్‌డీఏ పీడీ కిరణ్ కుమార్ మాట్లాడుతూ.. ఈ ఆర్థిక సంవత్సరంలో డిజిటల్ ఎంసీపీ ద్వారానే రుణాలు ఇవ్వడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో బ్యాంకు లింకేజ్ డీపీఎం ఎ. నాగలక్ష్మి, డీపీఎం నారాయణరావు, స్త్రీనిధి ఏజీఎం వి.సత్యనారాయణ, స్త్రీనిధి మేనేజర్ కుసుమ కుమారి, ఏపీఎం సుబ్బయ్యనాయుడు పాల్గొన్నారు.

రేపు కళాకారుల సమావేశం

ఆమదాలవలస, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో ఈ ఆదివారం నిర్వహించనున్న కళాకారుల సర్వసభ్య సమావేశాన్ని జయప్రదం చేయాలని ఆ సంఘ అధ్యక్షుడు పేడాడ ధనుంజయ రావు ఒక ప్రకటనలో కోరారు. వృద్ధ కళాకారులకు చేయూత, కార్తీకమాస వనభోజనాలు తదితర అంశాలపై చర్చించనున్నామన్నారు. కళాకారులు పాల్గొనాలని కోరారు.

ఘనంగా దుర్గాదేవి నిమజ్జనం

ఇచ్ఛాపురం, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): ఇన్నేసుపేటలో ఏర్పాటు చేసిన దుర్గాదేవి విగ్రహం నిమజ్జన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. భవాని మాలలు వేసిన స్వాములు విగ్రహాన్ని పల్లకిలో ఊరేగించి నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో జనసేన ఇన్‌చార్జి దాసరి రాజు, ఏఎంసీ డైరెక్టర్ డి.భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

100 ఉపాధి పనుల గుర్తింపు

పొందూరు, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): గ్రామాలలో ఉపాధి కార్మికులకు 100 రోజులు పని కల్పించేందుకు గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో వాసుదేవరావు, టీడీపీ మండల అధ్యక్షుడు రామ్మోహన్ అన్నారు. పొందూరులో సర్పంచ్ ఆర్.లక్ష్మి అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. ఈనెల 8 వరకు పనులు గుర్తించడం జరుగుతుందన్నారు. అవసరమైనవారికి జాబ్ కార్డులు అందించి 100 రోజులు పని కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ బాడాన గిరి, టీడీపీ పట్టణ అధ్యక్షుడు అనకాపల్లి చినరంగ, ఈవో మోహన్‌బాబు, డి.మురళి తదితరులు పాల్గొన్నారు.

తపాలా వారోత్సవాల్లో ఆధార్ క్యాంపులు

అరసవల్లి, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): జాతీయ తపాలా వారోత్సవాలు ఈనెల 6 నుంచి 10వ తేదీ వరకు నిర్వహిస్తున్నామని పోస్టల్ సూపరింటెండెంట్ వి.హరిబాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా శ్రీకాకుళం డివిజన్ ప్రజలకు ఆధార్ నమోదు, అప్‌డేట్ సేవలను అందించేందుకు డివిజన్ వ్యాప్తంగా ఆధార్ క్యాంపులను నిర్వహిస్తామన్నారు. ఈ క్యాంపులను శ్రీకాకుళం, ఆముదాలవలస, టెక్కలి, ప్రధాన తపాలా కార్యాలయాలు, అలాగే సీఆర్‌పురం, రాజాం, కొత్తూరు, పొందూరు, కోటబొ మ్మాళి, హిరమండలం ఉప తపాలా కార్యాలయాల్లో ఈనెల 8 నుంచి 14 వరకు ఏర్పాటు చేస్తున్నామన్నారు. శ్రీకాకుళం, కాశీబుగ్గ, పాతపట్నం సమీపంలోని ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల కోసం మొబైల్ ఆధార్ క్యాంపులను కూడా ఏర్పాటు చేస్తున్నామన్నారు. దీనివల్ల 5-15 ఏళ్ల లోపు వయసున్న పిల్లలు ఆధార్ సేవలను పొందవచ్చన్నారు. ఈ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వైభవంగా ఆదిత్యుని కల్యాణం

అరసవల్లి, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): అరసవల్లి సూర్య నారాయణ స్వామి వారి కల్యాణం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆశ్వయుజ శుద్ధ ఏకాదశి సందర్భంగా అనివెట్టి మండపంలో ఆలయ ప్రధాన అర్చకుడు ఇప్పిలి శంకర శర్మ ఆధ్వర్యంలో మేళతాళాలు, వేద మంత్రాల నడుమ కల్యాణం వైభవంగా జరిగింది. కార్యక్రమంలో అర్చకులు ఇప్పిలి సాందీప శర్మ, దర్భముళ్ల శ్రీనివాస శర్మ, ఆర్.వికాస్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.

6న స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర అవార్డులు

● కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్



మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం కలెక్టరేట్, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్ర అవార్డులను ఈనెల 6వ తేదీన ప్రదానం చేయనున్నట్లు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ వెల్లడించారు. ఈ మేరకు గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వచ్ఛత కోసం బాగా పనిచేసిన పారిశుధ్య కార్మికులు, ప్రజలు, ఉద్యోగులు తదితరులకు రాష్ట్ర ప్రభుత్వ అవార్డులివ్వనుందన్నారు. అన్ని శాఖలను పరిగణనలోకి తీసుకుని, వాటిలో ఎంపిక చేసిన 51 మందికి అవార్డులు ఇస్తామన్నారు. ప్రజా ప్రతినిధులు, జిల్లా ఇన్‌చార్జి మంత్రి, మంత్రుల సమక్షంలో ఈ అవార్డుల ప్రదానం ఉంటుంద న్నారు. డే అండ్ నైట్ వద్ద వంతెన కింది భాగంలో ఆసుప త్రులు, మెడి కల్ ల్యాబ్‌ల వ్యర్థాలను వేయవద్దని హెచ్చరించారు. సఫాయి మిత్ర సురక్ష శిబిర్‌లో భాగంగా పారిశుధ్య కార్మికులకు ఆరోగ్య శిబిరాలు నిర్వహిస్తామన్నారు. వారికి రక్షణ కిట్లు, గ్లౌజులు, మాస్కులు, కాలువల్లో పనిచేసేందుకు పీపీఈ కిట్లు ఉండాలన్నారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను నిషేధించామన్నారు. చెత్త నుండి సంపద తయారీ కేంద్రాలకు చెత్తను తరలించి, ఎరువుల తయారీతో ఆదాయాన్ని పొందవచ్చన్నారు. అందరూ స్వచ్ఛత అవార్డులు సాధించేందుకు కృషి చేయాలన్నారు.

61 వస్తువులపై జీఎస్టీ తగ్గింపు

కేంద్ర ప్రభుత్వం 61 రకాల వస్తువులపై జీఎస్టీ తగ్గించిందని, దీనిపై ప్రజలకు నెల రోజుల పాటు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. క్షేత్రస్థాయిలో ర్యాలీలు నిర్వహించి, ప్రస్తుత ధరలు, తగ్గించిన ధరలపై వివరిస్తామని తెలిపారు. ఈనెల 19న షాపింగ్ ఎగ్జిబిషన్ ఏర్పాటు చేసి, జీఎస్టీ తగ్గింపు ఉపయోగాలను వివరిస్తామన్నారు. సమావేశంలో డీఆర్వో ఎం.వేంకటేశ్వరరావు, ఉప కలెక్టర్ పద్మావతి, కార్పొరేషన్ కమిషనర్ ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

నత్తలతో కునుకు లేని ప్రజలు



రోడ్డుపై తిరుగుతున్న నత్తలు

ఆమదాలవలస, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): కనుగులవలస గ్రామంలో రోడ్లపై నత్తలు తిరుగుతుండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఎక్కడి నుంచి వచ్చాయో తెలియదు కాని గ్రామంలోని అన్ని వీధుల్లోనూ కనిపిస్తున్నా యి. రాత్రీ, పగలు తేడా లేకుండా తిరుగుతుండడంతో స్థానికులు ఆందోళనకు గురవుతున్నారు. కొందరు వీటిని ఆఫ్రికా నత్తలుగా చెబుతుండగా అటువంటి వి కాదని వర్షాకాలం కావడంతో నాగావళి నది నుంచి వస్తున్నాయని మరికొందరు పేర్కొంటున్నారు. ఆఫ్రికా నత్తలైతే గ్రామాల్లో చొరబడకుండా పంటపొ లాల్లో చేరి నాశనం చేస్తాయని పలువురు వృద్ధు లు చెబుతున్నారు. ప్రస్తుతం ఈ నత్తలు ఇళ్ల వరండాల్లోకి, పెరటిలోకి, రోడ్లపై తిరుగు తుండడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ద్విచక్ర వాహనాల కింద పడి మృత్యువాత పడుతున్నాయి. దీంతో నత్తల రక్తంతో రోడ్లు దుర్గంధం వెదజల్లుతున్నాయని స్థానికులు పేర్కొంటున్నారు. గతంలో వరదల సమయంలో ఎప్పుడూ గ్రామంలో నత్తలు కనిపించలేదని స్థానికులు చెబుతున్నారు. దీనిపై పశువైద్యశాఖ ఉప సంచాలకుడు జి.నారాయణరావు వద్ద ప్రస్తావించగా గ్రామంలో నత్తల నివారణకు కాపర్ సల్ఫేట్ ద్రావణం నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. దీనివల్ల కొంత ఉపశమనం కలుగుతుందన్నారు. అయితే కాపర్ సల్ఫేట్ ద్రావకం అత్యంత విషపూరితమైనదని, ఇది పిచికారీ చేసిన ప్రాంతంలో రెండు వారాల వరకు పశువులు, ఇతర ప్రాణులు ఆ గడ్డిని తింటే ప్రమాదమని ఆయన పేర్కొన్నారు.

భాషాపండితులకు స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతి

● ఉత్తర్వులు అందించిన డీఈవో



భాషాపండితులకు పదోన్నతి ఉత్తర్వులను అందిస్తున్న డీఈవో రవిబాబు

గుజరాతీపేట, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): భాషాపండితులు (2019) ఉన్నతీకరణలో భాగంగా ఎస్టీటీలకు స్థానం కల్పించడంతో డీఈవో పూల్‌లోకి వెళ్లిన భాషా పండితులకు స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతి లభించింది. గురువారం రాత్రి డీఈవో కార్యాల యంలో డీఈవో రవిబాబు ఉపాధ్యాయులకు నియామక ఉత్తర్వులను అందజేశారు. జిల్లాలో తెలుగు 65 మంది, హిందీ 6, ఒడియా 17 మంది కలిపి మొత్తం 88 మందికి పదోన్నతులు లభించాయి. భాషా పండితులుగా పనిచేసిన చోటే పదోన్నతులను ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించిందని, తర్వాత బదిలీల్లో వీరందరికీ ఖాళీ స్థానాల్లో సర్దుబాటు చేస్తున్నట్లు డీఈవో ఎ.రవిబాబు పేర్కొన్నారు. ఆరేళ్ల నుంచి సుదీర్ఘ పోరాటం అనంతరం పదోన్నతి కల్పించినందుకు రాష్ట్ర భాషోపాధ్యాయ సంస్థ జిల్లా శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పిసిని వసంతరావు, కూన రంగ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. పదోన్నతుల కోసం కృషి చేసిన రాష్ట్ర నాయకులు ఒటేరు శ్రీనివాసుల రెడ్డి, అంకాల్ కొండ్య, గాండ్లపర్తి శివనందరెడ్డి, ఎమ్మెల్సీ వేపాడ చిరవంజీవులకు భాషాపండితులు కృతజ్ఞతలు తెలిపారు.

కొత్త ఉపాధ్యాయులకు శిక్షణ ప్రారంభం

గుజరాతీపేట, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): మెగా డిఎస్సీ-2025 ద్వారా ఎంపికైన నూతన ఉపాధ్యాయులకు శిక్షణా తరగతులు శుక్రవారం ప్రారంభమయ్యాయి. జిల్లా కేంద్రంలోని నాలుగు కేంద్రాల్లో ఈ తరగతులు ఉదయం ఏడు నుంచి ప్రారంచినట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఎ.రవిబాబు తెలిపారు. పాఠ శాలల్లో విధులు చేపట్టక ముందే బోధనా పద్ధతులు, తరగతి గది నిర్వహణ, పాఠ్య విధానాలపై అవగాహన కల్పించనున్నామన్నారు. జిల్లా కేంద్రంలోని ఆదివారంపేట గ్లోబల్ జూనియర్ కళాశాల, ఢిల్లీ పబ్లిక్ స్కూల్ వాడాడ జంక్షన్, గొంటి వీధిలోని ఓల్డ్ హాస్టల్ వద్ద, విశ్వవిజేత జూనియర్ కళాశాలల్లో ఈ శిక్షణ ఇచ్చారు. ఈ కేంద్రాలను డీఈవో పరిశీలించి సూచనలిచ్చారు.

రేపటి నుంచి స్కూల్‌గేమ్స్ ఎంపికలు

శ్రీకాకుళం స్పోర్ట్స్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): జిల్లా స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్-14, 17, 19 బాలబాలికల జిల్లాస్థాయి ఎంపికలను ఆదివారం నుంచి 9వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు డీఈవో ఎ.రవిబాబు, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి బీవీ రమణ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో వివిధ ప్రాంతాల్లో పలు విభాగాల పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. ఈనెల 5న శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో హాకీ ఎంపికలు జరుగుతాయన్నారు. పెద్దపాడులో అండర్-14, 17, 19 బాలబాలికలకు రెజ్లింగ్, అండర్-17, 19 విభాగంలో వెయిట్ లిఫ్టింగ్ ఎంపికలు నిర్వహిస్తామన్నారు. అరసవల్లిలోని అర్చరీ అకాడమీలో అర్చరీ, టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో రగ్బీ, నెట్‌బాల్, రోప్ స్కిప్పింగ్, షూటింగ్‌బాల్ ఎంపికలు జరగుతాయన్నారు. శాంతినగర్ కాలనీలోని ఇండోర్ స్టేడి యంలో టేబుల్ టెన్నిస్, నరసన్నపేట సత్యవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో యోగా, ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో లాన్ టెన్నిస్ ఎంపికలు ఉంటాయన్నారు. ఆరవ తేదీన కోడిరామ్మూర్తి స్టేడియంలో అథ్లెటిక్స్, ఆర్ట్స్ కళాశాలలో త్రోబాల్ ఎంపికలు జరుగుతాయని, ఎచ్చెర్ల గవర్నమెంట్ హైస్కూలులో చెస్ ఎంపికలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఈ నెల 7న ఈ నెల ప్రభుత్వ డిగ్రీ కళా శాలలో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్ (బాలురు) ఉంటాయని, క్రికెట్ (బాలబాలికలకు), బాల్ బాడ్మింటన్, ఎచ్చెర్ల జీహెచ్ఎస్‌లో అండర్-19 బాలబాలికలకు ఎంపికలు జరుగుతాయన్నారు. 8న శ్రీకాకుళం ఆర్ట్స్ కళాశాల మైదానంలో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్ (బాలికలకు), శాంతినగర్ కాలనీలో సిమ్మింగ్‌పూల్‌లో స్విమ్మింగ్, టౌన్‌హాల్‌లో తైక్వాండో, ఫెన్సింగ్, ఎన్టీఆర్ మున్సిపల్ పాఠశాల మైదానంలో బాస్కెట్‌బాల్, సపక్‌పత్రా ఎంపికలు నిర్వహిస్తారు. శ్రీకాకుళం శ్రీ చైతన్య స్కూల్ ఆవరణలో కరాటే, కోడిరామ్మూర్తి స్టేడియంలో బేస్‌బాల్ ఎంపికలు జరుగుతున్నట్లు పేర్కొన్నారు. 9న తొగరాం జడ్పీహెచ్ఎస్‌లో హ్యాండ్‌బాల్ బాలబాలికలకు ఎంపికలు నిర్వ హిస్తున్నట్లు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

అలరించిన నృత్య నీరాజనం



మహిషాసుర మర్దని నృత్యరూపకం

గుజరాతీపేట, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక కత్తెరవీధిలోని రాజరాజేశ్వరి దేవీ పీఠంలో శరన్నవరాత్రి మహోత్సవంలో భాగంగా గురు వారం రాత్రి నృత్యనీరాజనం అలరించింది. శివశ్రీ నృత్యనికేతన్ విద్యార్థులు వివిధ భక్తిగీతాలకు నృత్యాభినయం చేశారు. దశావతార రూపిణి అనే గీతానికి తొమ్మిది మంది అమ్మవారి అవతారాల్లో ఆలకట్టుకున్నారు. కార్యక్ర మంలో పీఠం అర్చకుడు లక్ష్మీ గణపతి శర్మ, నృత్య దర్శకుడు రఘుపా త్రుని శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

స్వేచ్ఛావతి అమ్మవారి ఆలయంలో..

ఇచ్ఛాపురం, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): దసరా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా స్వేచ్ఛావతి అమ్మవారి ఆలయంలో గురువారం రాత్రి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వెంకటేశ్వర డ్యాన్స్ అకాడమీ విద్యార్థులు ప్రదర్శించిన జానపద, ఒడియా, సంబల్పూరి నృత్యాలు ఆకట్టుకున్నాయి. అకాడమీ అధ్యక్షుడు చిన్నాగురుస్వామి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. నాట్య గురువు శ్రుతిపట్నాయిక్, జయలక్ష్మి పట్నాయక్, ఆలయ అధికారులు పాల్గొన్నారు.



నృత్యాభినయం చేస్తున్న విద్యార్థినులు


బీజాపూర్ జిల్లాలో లొంగిపోయిన మావోయిస్టులు

ఛత్తీస్‌గఢ్‌లో ఇద్దరు గిరిజనుల హత్య

- మావోయిస్టుల ఘాతుకం
- బీజాపూర్ జిల్లాలో లొంగిపోయిన 103మంది మావోయిస్టులు

చర్ల, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్, సుకుమా జిలాల్లో మావోయిస్టులు ఇద్దరు గిరిజనులను హత్య చేశారు. బీజాపూర్ జిల్లా పూజారి కాంకేర్ గ్రామానికి చెందిన మడకం భీమా(45)ను మావోయిస్టులు గురువారం అతని ఇంటి ఆవరణలోనే దారుణంగా కత్తులతో పొడిచి చంపేశారు. భీమా 2018లో తెలంగాణలోకి వెళ్లిపోయి, ములుగు జిల్లాలో ఓ ఎస్ఐతో కలిసి పని చేశాడని, గ్రామంలో పోలీస్ క్యాంప్ పెట్టిన తరువాత తిరిగి వచ్చి, ప్రజలను బెదిరిస్తూ, రూ.లక్షలు దోచుకుంటున్నాడని, భూములు ఆక్రమిస్తున్నాడని అందుకే హత్య చేశామని మావోయిస్టులు ఓ లేఖలో పేర్కొన్నారు. అలాగే సుకుమా జిల్లా కిష్టారం అడవుల్లో ఓ గిరిజనుడిని మావోయిస్టులు హతమార్చారు. ఇదిలా ఉంటే ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం గంగలూరు అడవుల్లో గురువారం సాయంత్రం ఎన్‌కౌంటర్ జరిగింది. ఒక మావోయిస్టు చనిపోయాడు. మరోవైపు, బీజాపూర్ జిల్లా పోలీసులు ఎదుట గురువారం 103 మంది మావోయిస్టు పార్టీ సభ్యులు లొంగిపోయారు. వీరిలో 22 మంది మహిళలున్నారు. లొంగి పోయిన వారిలో 47మందిపై మొత్తం కలిపి రూ.1.06కోట్ల రివార్డులున్నట్టు ఎస్పీ జితేంద్ర యాదవ్ తెలిపారు. ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటివరకు 421మంది మావోయిస్టులు అరెస్టయ్యారని, 410 మంది లొంగి పోయారని, 137 మంది ఎన్‌కౌంటర్లలో మృతి చెందారని వెల్లడించారు.

అసభ్య పోస్టుల కేసులో అంజద్ బాషా పీఏ అరెస్టు

- కడప కోర్టులో హాజరు.. బెయిల్ మంజూరు

కడప క్రైం, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): కడప ఎమ్మెల్యే ఆర్.మాధవిపై అసభ్య పదజాలంతో ఉన్న వీడియోను సోషల్ మీడియాలో పోస్టు చేసిన కేసులో మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా పీఏ షేక్ మహ్మద్‌ఖాజాను పోలీసులు అరెస్టు చేశారు. గురువారం అతన్ని కడప ఎక్సైజ్ కోర్టులో హాజరు పరచగా.. సొంత పూచీకత్తుపై అతనికి కోర్టు బెయిలు మంజూరు చేసింది. ఆ వివరాలను కడప డీఎస్పీ వెంకటేశ్వర్లు, వన్‌టౌన్ సీఐ రామకృష్ణ విలేకరులకు వివరించారు. కడప అక్బర్ వీధికి చెందిన షేక్ మహ్మద్ ఖాజా మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషాకు పీఏగా పనిచేస్తున్నాడు. 2024 ఎన్నికల సమయంలో ప్రస్తుత కడప ఎమ్మెల్యే మాధవి, ఆమె భర్త శ్రీనివాసరెడ్డిపై కడప అలంఖాన్‌పల్లెకు చెందిన విజయలక్ష్మి అసభ్యకరంగా మాట్లాడారు. ఆ వీడియోను అంజద్‌బాషా అతని సోదరుడు అహ్మద్‌బాషా ప్రోద్బలంతో సోషల్ మీడియాలో షేక్ మహ్మద్‌ఖాజా పోస్టు చేశాడు. ఈ వీడియో వైరల్ కావడంతో టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి ఫిర్యాదు మేరకు అంజద్‌బాషా, అహ్మద్‌బాషా, షేక్ మహ్మద్‌ఖాజాలపై కేసు నమోదు చేశారు. షేక్ మహ్మద్ ఖాజాను బుధవారం హైదరాబాద్‌లో అదుపులోకి తీసుకున్నారు. గురువారం కోర్టులో హజరు పరిచారు. ఎవరైనా సోషల్ మీడియాలో అసభ్యకరమైన వీడియోలు పోస్టు చేస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా పోలీసులు హెచ్చరించారు.

'సిట్' ముందు హాజరైన మిథున్‌రెడ్డి

విజయవాడ, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): మద్యం కుంభకోణంలో నిందితుడిగా ఉన్న రాజంపేట ఎంపీ పీవీ మిథున్‌రెడ్డి విజయవాడలోని సిట్ అధికారుల ముందు శుక్రవారం హాజరయ్యారు. ప్రతి సోమవారం, శుక్రవారం సిట్ అధికారుల ముందు హాజరవ్వాలని కోర్టు బెయిల్ ఉత్తర్వుల్లో షరతు విధించింది. దాని ప్రకారం మిథున్‌రెడ్డి సిట్ కార్యాలయానికి వచ్చి పుస్తకాల్లో సంతకం చేశారు. ఇటీవలే ఆయనకు కోర్టు బెయిల్ మంజూరు చేయడంతో రాజమహేంద్రవరం కేంద్ర కారాగారం నుంచి విడుదలైన విషయం తెలిసిందే.


సర్జరీ సిస్టమ్‌ను ప్రారంభిస్తున్న సత్యసాయి సెంట్రల్ ట్రస్టు సభ్యుడు చక్రవర్తి, పక్కన సత్యసాయి సెంట్రల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్జే రత్నాకర్ తదితరులు

'సత్యసాయి' ఆస్పత్రిలో రోబోటిక్ సర్జరీ సేవలు

- గుండె, యూరాలజీ విభాగంలో అందుబాటులోకి సేవలు

పుట్టపర్తి రూరల్, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తిలోని సత్యసాయి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో అత్యాధునిక రోబోటిక్ సర్జరీ సేవలు అందుబాటులోకి వచ్చాయి. రూ.8 కోట్ల విలువైన అత్యాధునిక రోబోటిక్ సర్జరీ వ్యవస్థను సత్యసాయి సెంట్రల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్జే రత్నాకర్, సభ్యుడు చక్రవర్తి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా రత్నాకర్ మాట్లాడుతూ, భగవాన్ సత్యసాయి ధ్యేయమైన విలువలు, కరుణ, ప్రేమతో కూడిన అత్యాధునిక వైద్యాన్ని ఉచితంగా అందుబాటులోకి తెచ్చామన్నారు. ఎస్ఎస్ ఇన్నొవేషన్స్ అనే భారతీయ సంస్థ ప్రపంచ స్థాయి ప్రమాణాలకు తగ్గట్లు ఈ రోబోటిక్ శస్త్ర చికిత్స వ్యవస్థను అభివృద్ధి చేసిందన్నారు. ఈ వ్యవస్థతో శరీరంలోని సున్నితమైన ప్రాంతాలకు కూడా అత్యంత కచ్చితత్వంతో, సంక్లిష్టమైన శస్త్ర చికిత్సలను సులభతరంగా చేయవచ్చని వెల్లడించారు. రోబోటిక్ సర్జరీకి రూ.లక్షలు ఖర్చు అవుతుందని, కానీ సత్యసాయి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో పూర్తి ఉచితంగా అందుతుందని స్పష్టం చేశారు.


రోబోటిక్ సర్జరీ యంత్రాలు

ములకలచెరువు కేంద్రంగా
నకిలీ మద్యం తయారీ

- రూ.1.75 కోట్ల విలువైన నకిలీ మద్యం స్వాధీనం
- స్పిరిట్, బాటిళ్లు, పరికరాలు సీజ్.. 9 మంది అరెస్టు


నకిలీ మద్యాన్ని తయారు చేస్తున్న దృశ్యం.. స్వాధీనం చేసుకున్న నకిలీ మద్యం బాక్సులు

రాయచోటి, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా ములకలచెరువులో శుక్రవారం ఎక్సైజ్ అధికారులు దాడులు జరిపి రూ.1.75కోట్ల విలువైన నకిలీ మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. కడప ప్రొహిబిషన్, ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి అధ్వర్యంలో ఈ దాడులు జరిగాయి. అనంతరం ఆయన మీడియాకు వివరాలు వెల్లడించారు. విజయవాడకు చెందిన జనార్దన్‌రావు, ఆయన అనుచరుడు రాజు ములకలచెరువుకు సమీపంలోని కనుగొండ ఆర్చి సమీపంలో ఉన్న పాత డాబాను అద్దెకు తీసుకుని నకిలీ మద్యం తయారు చేస్తున్నారు. ఈ మద్యాన్ని వాహనం ద్వారా తంబళ్లపల్లె నియోజకవర్గంలోని పలు ప్రాంతాలకు సరఫరా చేస్తున్నారు. ప్రభుత్వ ధర కంటే తక్కువకే ఇస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. పలు ప్రభుత్వ మద్యం షాపులకు కూడా ఈ మద్యాన్ని సరఫరా చేస్తున్నారు. ఇటీవల జిల్లా ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పెద్దతిప్ప సముద్రం మండలంలో తనిఖీలు నిర్వహిస్తూ.. నకిలీ మద్యం తీసుకెళ్తున్న వాహనాన్ని నిలిపారు. బాటిళ్ల మీద ఉన్న లేబుల్‌ను స్కాన్ చేశారు. అయితే స్కాన్ కాకపోవడంతో అనుమానం వచ్చి విషయాన్ని ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ వ్యవహారంపై ఎక్సైజ్ డైరెక్టర్ రాహుల్ దేవ్‌కు ఫిర్యాదులు అందడంతో అధికారులు గత నాలుగు రోజులుగా నిఘా ఉంచి శుక్రవారం ఈ దాడులు చేశారు. 15 వేల నకిలీ మద్యం బాటిళ్లు, 1050 లీటర్ల స్పిరిట్ క్యాన్లు, 1500 లీటర్ల బ్లెండ్(తయారైన నకిలీ మద్యం), 10 వేల ఖాళీ మద్యం బాటిళ్లు, 4 వేల మద్యం సీసా మూతలు.. స్టిక్కర్లు, మద్యం బాటిళ్లు తయారు చేసే పరికరాలు, ఇతర సామగ్రి, నకిలీ మద్యం సరఫరా చేసే వాహనాన్ని సీజ్ చేశారు. తమిళనాడు రాష్ట్రం కృష్ణగిరికి చెందిన మరిమారన్, తిరుపత్తూరుకు చెందిన సురేశ్, సూర్య, అనంద న్, ఒడిశా రాష్ట్రం బ్రహ్మపూర్‌కు చెందిన ఆనంద్ దాస్, మిథున్, విశాఖపట్నానికి చెందిన స య్యద్ అలీ, వాహన డ్రైవర్ బాలరాజు, నకిలీ మద్యం కలిగి ఉన్న బెల్ట్ షాపు నిర్వాహకుడు రంగసముద్రానికి చెందిన నాగరాజు, పెద్దతిప్ప సముద్రంలోని మద్యం దుకాణ నిర్వాహకుడు టీడీపీ నేత కట్టా సురేంద్రనాయుడును అరెస్టు చేశారు. విజయవాడకు చెందిన జనార్దన్‌రావు, అతని అనుచరుడు రాజు, ములకలచెరువులోని రాక్‌స్టార్ ప్రభు త్వ మద్యం దుకాణ నిర్వాహకుడు రాజేశ్ తదితరులపైనా కేసు నమోదు చేశారు.


సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి

నిందితుల్లో తంబళ్లపల్లె టీడీపీ ఇన్‌చార్జి పీఏ

రాజేశ్ తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి దాసరిపల్లి జయచంద్రారెడ్డి పీఏగా పనిచేస్తున్నారు. ఇతని పేరుతో ఉన్న వాహనం ద్వారానే నకిలీ మద్యం సరఫరా చేస్తున్నారు. దీనిపై సర్వత్రా చర్చ జరుగుతోంది. ఈ నకిలీ మద్యం తయారీ వెనుక తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ ముఖ్య నాయకుల సమీప బంధువుల ప్రమేయం ఉన్నట్టు ప్రచారం జరుగుతోంది. ఈ నకిలీ మద్యం తయారీలో జిల్లాలోని పలువురు టీడీపీ నాయకుల హస్తం ఉన్నట్టు కూడా ఆరోపణలు వినిస్తున్నాయి. నియోజకవర్గంలోని పలు బెల్ట్‌షాపులు, ప్రభుత్వ మద్యం దుకాణాల్లోనూ ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించారు.

గ్యాంగ్ రేప్ కేసు నిందితులకు రిమాండ్

- గత నెల 25న చిత్తూరు సమీపంలో బాలికపై అఘాయిత్యం

చిత్తూరు అర్బన్, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): ఇటీవల చిత్తూరులో ఇంటర్ విద్యార్థినిపై గ్యాంగ్ రేప్‌కు పాల్పడిన ముగ్గురు యువకులను పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను డీఎస్పీ సాయినాథ్ మీడియాకు వివరించారు. గత నెల 25వ తేదీన చిత్తూరు నగర సమీపంలో ఉన్న నీవా నగర వనం పార్కుకు వచ్చిన యువ జంటను ముగ్గురు యువకులు బెదిరించారు. బాలికపై అత్యాచారానికి పాల్పడ్డారు. ఆ జంటలోని యువకుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు 29వ తేదీన పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో నిందితులైన మహేష్, కిశోర్, హేమంత్‌ను శుక్రవారం అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు. ముగ్గురు నిందితులకు పోక్సో కోర్టు ఈ నెల 16 వరకు రిమాండ్ విధించింది. నిందితుల్లో ఒకరైన మహేష్ ఓ బాలికను ఈవ్ టీజింగ్ చేసిన కేసులో నిందితుడిగా ఉన్నాడు. కిశోర్ 2022లో నగరంలోని ఓ వైన్ షాపులో పనిచేస్తుండగా అక్కడి మద్యాన్ని బ్లాక్‌లో విక్రయించాడని అతనిపై కేసు నమోదైంది. కాలక్షేపం కోసం పార్కులకు వచ్చే ప్రేమ జంటలను లక్ష్యంగా చేసుకుని వారు కలిసున్న దృశ్యాలను వీడియో తీసి వారిని బెదిరించడం.. వారి వద్ద ఉన్న నగదు, బంగారాన్ని లాక్కోవడం.. లైంగిక వేధింపులకు పాల్పడటం.. వీరి నేర ప్రవృత్తిగా పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది. కాగా.. నిందితుల్ని స్థానిక డీపీవో కార్యాలయం నుంచి అర కిలో మీటరు దూరంలో ఉన్న కోర్టు వరకు బేడీలు వేసి రోడ్డుపై నడిపించుకుంటూ తీసుకెళ్లారు.

హోటల్ సిబ్బందిపై వైసీపీ నేత నాగార్జున యాదవ్ దాడి

- అల్పాహారం ఆలస్యంగా ఇచ్చారని దౌర్జన్యం
- ఇరువురికి గాయాలు.. కేసు నమోదు


హోటల్ యజమాని కొడుకు ప్రేమ్‌కుమార్

సత్తెనపల్లి, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): అల్పాహారం తీసుకురావడంలో ఆలస్యం అయిందని హోటల్ యజమాని, సిబ్బందిపై వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి యనమల నాగార్జున యాదవ్ అతని అనుచరులు రెచ్చిపోయారు. వారిపై దాడి చేసి గాయపర్చారు. ఈ దాడి ఘటన గురువారం రాత్రి పల్నాడు జిల్లా సత్తెనపల్లిలోని తాలూకాసెంటర్‌లో జరిగింది. రాత్రి 10 గంటల సమయంలో నాగార్జున యాదవ్ అతని అనుచరులు పట్టణంలోని గుడ్‌మార్నింగ్ హోటల్‌కు టిఫిన్ చేసేందుకు వచ్చారు. టిఫిన్ అందించడం ఆలస్యమవుతుందని నాగార్జునయాదవ్ అతని అనుచరులు గొడవకు దిగారు. హోటల్ యజమాని శేఖర్, అతని కుమారుడు ప్రేమ్‌కుమార్, వర్కర్ నాగేశ్వరరావుపై దాడి చేశారు. ఈ ఘటనలో ప్రేమ్‌కుమార్, వర్కర్‌కు గాయాలయ్యాయి. తనతో పెట్టుకుంటే అబ్బూరు ఊరు ఊరంతా కదిలొస్తుందంటూ హోటల్ యజమాని శేఖర్‌ను నాగార్జున యాదవ్ బెదిరించారు. దాడి ఘటనపై హోటల్ యజమాని శేఖర్ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.


హోటల్ యజమానిపై దౌర్జన్యం చేస్తున్న వైసీపీ నాయకుడు యనమల నాగార్జునయాదవ్

ముంచెత్తిన వాన

- లోతట్టు ప్రాంతాలు జలమయం
- ఇళ్లలోకి చేరిన వరద నీరు
- నీటమునిగిన పంట పొలాలు

బంగాళాఖాతంలో ఏర్పడిన వాయు గుండం ప్రభావంతో జిల్లా వ్యాప్తంగా గురు, శుక్రవారాల్లో భారీగా వర్షం కురి సింది. దీంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. పంట పొలాలు నీట మునిగాయి. పలు గ్రామాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. రోడ్లు కోతకు గురవడంతో ఆయా గ్రామా లకు రాకపోకలు నిలిచిపోయాయి. ముంపు ప్రాంతాల్లో అధికారులు, ప్రజా ప్రతినిధులు పర్యటించారు.

-ఆంధ్రజ్యోతి బృందం


జలుమూరు: కొమనాపల్లి వద్ద వరద ఉధృతిని ఎస్పీ మహేశ్వరరెడ్డికి వివరిస్తున్న నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి


పలాస: బైపాస్ రోడ్డులో నీటమునిగిన ఓ ఇంజనీరింగ్ వర్క్‌షాప్


అరసవల్లి: చెరువులా పీఎస్ఎన్ఎం స్కూల్ ప్రాంగణం


ఎల్ఎన్ పేట: దబ్బపాడు, సుమంతాపురం గ్రామాల మధ్య గెడ్డకు పడిన గండిని పరిశీలిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్


హిరమండలం: వంశధార వరద నీటిలో కలిసిపోయిన జగనన్న కాలనీ


సోంపేట: నదిలో కొట్టుకుపోయిన వ్యక్తిని రక్షించిన ఎస్ఐ, సిబ్బంది


గార/రూరల్: వరద ప్రాంతాల్లో పర్యటిస్తున్న శ్రీకాకుళం ఎమ్మెల్యే శంకర్


హిరమండలం: వరద నీటిలో అక్కరాపల్లి పంచాయతీ కార్యాలయం


పలాస: గొప్పిలి రోడ్డులో ఫ్లైఓవర్ వద్ద వరద ఉధృతి


మెళియాపుట్టి: కొండపైకి వెళ్లే దారిలో విరిగిపడిన కొండచరియ


నందిగాం: శివరాంపురం వద్ద రహదారి కోత


హరిపురం: కుంటికోట వద్ద చెరువులా మారిన వరి పొలాలు


సంతబొమ్మాళి: నౌపడ వద్ద ముంపులో పంటపొలాలు


జలుమూరు: కొమనాపల్లి వద్ద నీట మునిగిన పంట పొలాలు


నందిగాం: నీటమునిగిన ఉయ్యాలపేట పంట పొలాలు


అరసవల్లి: జలదిగ్బంధంలో డీసీసీబీ కాలనీ


కోటబొమ్మాళి: చెరువుకు గండి కొడుతున్న పాకివలస గ్రామస్థులు


జి.సిగడాం: సంతవురిటి గ్రామ కూడలి వద్ద నిలిచిన ట్రాఫిక్


నందిగాం:ఉయ్యాలపేటకు చెందిన వ్యక్తిని డోలీలో తరలిస్తూ..


పాతపట్నం: కాజ్‌వే పై నుంచి ప్రవహిస్తున్న మహేంద్రతనయ


సరుబుజ్జిలి: వరి పంట పొలాల్లో వంశధార వరదనీరు


గార రూరల్: గార వద్ద సీఎస్పీ రోడ్డుపైకి వచ్చిన వంశధార


కవిటి: పుక్కళ్లపాలెం వద్ద కోతకు గురైన సముద్ర తీరం


వజ్రపుకొత్తూరు: హకుంపేటలో ఇంట్లోకి చేరిన నీరు


అరసవల్లి: కోడిరామ్మూర్తి స్టేడియం వద్ద కూలిన చెట్టు